ఆటలు ఆరంభం

ఒలింపిక్స్‌లో మొదలైన టీమ్ ఈవెంట్స్ • తొలిరోజు సాకర్, రగ్బీ సెవెన్స్ మ్యాచ్‌లు

నేడు భారత్ ఆర్చర్లకు తొలి పరీక్ష • రేపు ప్రారంభోత్సవ కార్యక్రమాలు

నిఖత్ జరీన్

పారిస్: క్రీడాభిమానులు అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న విశ్వక్రీడా సంబురాలకు ఎట్టకేలకు తెరలేచింది. పారిస్ వేదికగా జరుగుతున్న 33వ ఒలింపిక్స్ పోటీలలో భాగంగా బుధవారం సాకర్, రగ్బీ సెవెన్స్ మ్యాచ్‌లతో విశ్వక్రీడలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్ సమీపంలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమాల తర్వాత ఒలింపిక్స్ అధికారికంగా ఆరంభమవనుండగా బుధవారం నుంచే టీమ్ ఈవెంట్స్ ప్రారంభమయ్యాయి. స్పెయిన్-ఉజ్బెకిస్థాన్ మధ్య జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్‌తో అంతర్జాతీయ ఆటల పండుగ మొదలైంది. గురువారం ఆర్చరీ, హ్యాండ్‌బాల్ రగ్బీ సెవెన్స్, ఫుట్‌బాల్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆర్చరీలో భాగంగా గురువారం భారత ఆర్చర్లు తొలి పరీక్ష ఎదుర్కోనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమాలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ సిద్ధమయ్యాయి.

సాకర్‌లో స్పెయిన్ బోణీ

ఇటీవలే యూరో కప్ గెలిచిన జోష్‌లో ఉన్న స్పెయిన్ తొలి మ్యాచ్‌తోనే బోణీ కొట్టింది. పశ్చిమ పారిస్‌లో ఉన్న పార్క్ డెస్ ప్రిన్సెస్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో 2-1తో ఉజ్బెకిస్థాన్‌ను చిత్తు చేసింది. స్పెయిన్ ఫుట్‌బాలర్ మార్క్ పుబిల్ ఆట 29వ నిమిషంలో గోల్ కొట్టి ఒలింపిక్స్‌లో తొలి గోల్ కొట్టిన ప్లేయర్‌గా నిలిచాడు. ఇక సారథి లియోనల్ మెస్సీ లేకుండా ఒలింపిక్స్ ఆడుతున్న అర్జెంటీనా.. మొరాకోతో మ్యాచ్‌ను 2-2తో డ్రా చేసుకుంది. న్యూజిలాండ్ 1-0తో గినియాపై నెగ్గింది. రగ్బీ సెవెన్స్‌లో ఆస్ట్రేలియా, అర్జెంటీనా, ఫిజీ, ఐర్లాండ్ విజయాలు నమోదుచేశాయి.

భారత ఆర్చర్లకు తొలి పరీక్ష

ఆటల షెడ్యూల్‌లో భాగంగా భారత ఆర్చర్లకు తొలి పరీక్ష గురువారం ఎదురుకానుంది. మొత్తం ఐదు విభాగాల (పురుషుల, మహిళల వ్యక్తిగత, టీమ్, మిక్స్‌డ్ టీమ్)లో ర్యాంకింగ్ రౌండ్స్ జరుగుతాయి.

PARIS 2024 రేపటి నుంచి

చమీర ఔట్

కొలంబో: స్వదేశంలో భారత్‌తో జరుగబోయే రెండు పరిమిత ఓవర్ల సిరీస్‌లకు ముందు శ్రీలంక క్రికెట్ జట్టుకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ దుష్మంత చమీర గాయం కారణంగా టీ20, వన్డే సిరీస్‌కు దూరమయ్యాడని శ్రీలంక క్రికెట్(ఎస్ఎల్‌సీ) చీఫ్ సెలక్టర్ ఉపుల్ తరంగ తెలిపాడు. అతడి స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడిని త్వరలో ప్రకటిస్తామని చెప్పాడు. వైట్‌బాల్ ఫార్మాట్‌లో కీలకమైన చమీర గత ఏడాదిన్నర కాలంగా తరుచూ గాయాలతో సతమతమవుతున్నాడు.

పారిస్‌లో కరోనా కలకలం

- ఆస్ట్రేలియా వాటర్ పోలో జట్టులో ఐదుగురికి నిర్ధారణ

పారిస్: శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న పారిస్ ఒలింపిక్స్‌లో కరోనా కలకలం రేగింది. ఆస్ట్రేలియాకు చెందిన మహిళల వాటర్ పోలో జట్టులోని ఐదుగురు క్రీడాకారులకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు ఆ దేశ చీఫ్ డి మిషన్ అన్నా మేరీస్ తెలిపారు. అయితే తాము ప్రోటోకాల్ ప్రకారం నడుచుకుంటున్నామని, కరోనా సోకిన వారిని 'ఒలింపిక్ విలేజ్' నుంచి వేరు చేసి ఉంచామని ఆమె వెల్లడించారు.

అప్పుడు షమీ ఆత్మహత్యకు యత్నించాడు!

- ఇంటర్వ్యూలో స్నేహితుడి వెల్లడి

లక్నో: టీమ్‌ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ షమీ 2018లో తనపై వచ్చిన మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు, భార్య నమోదు చేసిన గృహహింస కేసు కారణంగా మానసికంగా చితికిపోయాడా? అంటే అవుననే అన్నాడు అతడి స్నేహితుడు ఉమేశ్ కుమార్. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ఉమేశ్.. ''షమీ ఆ దశలో చాలా సమస్యలతో పోరాడాడు. అతడు అప్పుడు (2018లో) నాతోనే ఉండేవాడు. పాకిస్థాన్‌తో చాంపియన్స్ ట్రోఫీలో ఓడిపోయాక అతడి భార్య హసీన్ జహాన్.. షమీపై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు చేయడంతో బీసీసీఐ దీనిపై విచారణ చేపట్టింది. దానికి షమీ ఎంతగానో కుమిలిపోయాడు. 'నేను దేనినైనా భరిస్తాను గానీ దేశానికి ద్రోహం చేశాననే ఆరోపణలను మాత్రం సహించలేను' అని నాతో అన్నాడు. ఆ వార్తలు వచ్చిన రోజు నేను షమీతోనే ఉన్నా. ఆ రోజు తెల్లవారుజామున 4 గంటలకు నేను నీళ్లు తాగడానికి కిచెన్‌లోకి వెళ్లేటప్పుడు అదే సమయంలో 19వ అంతస్తులో ఉన్న మా బాల్కనీలో షమీ నిల్చుని ఉండటం నేను చూశాను. అప్పుడేం జరిగిందో నేను ఊహించగలను. ఆ రాత్రి షమీ జీవితంలో చాలా సుదీర్ఘంగా గడిచింది. ఆ తర్వాత ఒక రోజు మేం మాట్లాడుకుంటుండగా బీసీసీఐ నుంచి అతడికి క్లీన్ చిట్ రాగానే షమీ చాలా సంతోషపడ్డాడు. ఆరోజు అతడు ప్రపంచకప్ గెలిచిన దాని కంటే ఎక్కువ సంతోషించాడు..' అని వ్యాఖ్యానించాడు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ షురూ

హనుమకొండ చౌరస్తా, జూలై 24: తెలుగు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధిస్తున్నారని అంతర్జాతీయ ప్లేయర్లు నందగోపాల్ కిదాంబి, జేబీఎస్ విద్యాధర్ అన్నారు. వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలో తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభించారు. డాక్టర్ రమేశ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులు నందగోపాల్, విద్యాధర్ మాట్లాడారు. మనవాళ్లు అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని తెలుగు రాష్ట్రాలకు ఎంతో పేరు తెస్తున్నారని, వారందరినీ స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ క్రీడల్లో వివిధ జిల్లాల నుంచి 140 మంది క్రీడాకారులు, 20 టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా కార్యదర్శి రమేశ్‌రెడ్డి, ట్రెజరర్ నాగకిషన్, వరంగల్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐవోసీలోకి నీతా అంబానీ

పారిస్: అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ)లో ప్రముఖ క్రీడా ఔత్సాహికురాలు నీతా అంబానీ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. బుధవారం జరిగిన 142వ ఐవోసీ సెషన్‌లో నీతా అంబానీ 100 శాతం ఓటింగ్ సొంతం చేసుకుంది. ఎన్నికపై ఆమె స్పందిస్తూ 'ఐవోసీ సభ్యురాలిగా తిరిగి ఎన్నిక కావడం చాలా సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా ఐవోసీఏ అధ్యక్షుడు థామస్ బాచ్‌తో పాటు సహచర సభ్యులకు కృతజ్ఞతలు. నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. ఈ ఎన్నిక నా వ్యక్తిగతం కాదు.. ప్రపంచ క్రీడా యవనికపై భారత్ క్రీడాభివృద్ధికి నిదర్శనం. ఈ సందర్భాన్ని ప్రతీ భారతీయునితో పంచుకోవాలనుకుంటున్నాను' అని పేర్కొంది. భారత ఒలింపిక్ సమాఖ్య(ఐవోఏ)తో కలిసి రిలయన్స్ ఫౌండేషన్.. ఒలింపిక్స్ కోసం ప్రత్యేకంగా ఇండియా హౌజ్ ఏర్పాటు చేసింది

న్యూజిలాండ్ సాకర్ టీమ్‌పై స్పై!

పారిస్: ఒలింపిక్స్ ఆరంభానికి ముందే కెనడా ఫుట్‌బాల్ జట్టులోని పలువురు చేసిన నిర్వాకానికి ఆ దేశం ఐవోసీ ఎదుట క్షమాపణలు చెప్పుకోవాల్సి వచ్చింది. వివరాల్లోకెళ్తే.. న్యూజిలాండ్ సాకర్ టీమ్ ట్రైనింగ్ సెషన్‌లో భాగంగా ఆకాశంలోకి డ్రోన్ రావడంతో ఆ జట్టు కోచింగ్ సిబ్బంది ఈ విషయాన్ని ఒలింపిక్స్ నిర్వాహకుల వద్దకు తీసుకెళ్లారు. ఆ తర్వాత విచారణలో డ్రోన్ ఎగురవేసింది కెనడా ఫుట్‌బాల్ జట్టులోని ఓ సపోర్ట్ స్టాఫ్ మెంబర్ అని తేలింది. దీంతో కెనడా క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. ఇరు జట్లూ గురువారం తమ తొలి మ్యాచ్‌లో తలపడాల్సి ఉంది.

సాల్ట్ లేక్ సిటీలో 2034 వింటర్ ఒలింపిక్స్

పారిస్ : యూనైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్ఏ) లోని ఉటా రాష్ట్రంలో ప్రధాన నగరమైన సాల్ట్ లేక్ సిటీ 2034 వింటర్ ఒలింపిక్స్, పారాలింపిక్స్ ఆతిథ్య హక్కులను దక్కించుకుంది. పారిస్‌లో బుధవారం జరిగిన 142వ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) సమావేశంలో ఈ మేరకు ఓటింగ్ నిర్వహించగా 89 ఓట్లకుగాను 83 మంది 'సాల్ట్ లేక్ సిటీ'కి ఆమోదం తెలిపారు. 2002లోనూ ఇదే నగరంలో వింటర్ ఒలింపిక్స్ జరిగాయి.

'పారిస్'కు ఎలుకల బెడద

పారిస్: ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఎలుకల బెడద స్థానిక అధికారులకు సవాల్‌గా మారింది. వేల కోట్లు వెచ్చించి నిర్వహిస్తున్న ఒలింపిక్స్‌ను వీక్షించడానికి పారిస్‌కు వచ్చే సందర్శకులకు నగరంలో మూషికాలు కనిపించకుండా ఉంచేందుకు పారిస్ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. ఈ క్రీడల కోసం నగర సుందరీకరణ పనులు చేపట్టినప్పుడే ఎలుకలు అత్యధికంగా ఉన్న ప్రాంతాలలో ఉచ్చులు వేసి వాటి ఆట కట్టించినట్టు పారిస్ డిప్యూటీ మేయర్ అన్నె-క్లేరీ బౌక్స్ ఎఎఫ్‌పీకి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'ఎలుకలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలను గుర్తించి అక్కడ ఉచ్చులు బిగించి చాలా ఎలుకల ఆట కట్టించాం' అని తెలిపారు. యంత్రాల ద్వారా ఉపయోగించే సాధానాలతో పాటు కెమికల్స్ ద్వారా వాటిని నిర్మూలించినట్టు చెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.